# శృంగార వీధి జారుపాట్లు

**ఎదుట బంగారుబొమ్మ...**

**చేతిలో లేత తమలపాకులు, సన్ననివక్కలూ, పచ్చకర్పూరం, యాలకులు, లవంగాలు, జాపత్రి.... సుగంధద్రవ్యాల బంగారుపళ్లెం రాత్రి వెన్నెలమొత్తం అగరుధూపమై గది అంతా వ్యాపించినట్టు 'తేటతెల్లని' పరిమళం... కాసేపు విష్ణుమూర్తిని పక్కకి తప్పుకోమని తప్పించి తెచ్చిన పాలకడలి పాలనురుగులాంటి తెల్లనిపక్క....**

మనస్సు సరేసరి.. శరీరంమీద, పేరుకి బట్టలున్నా, కోరిక ఎప్పుడో నగ్నమైపోయింది.

ఎవరా మనిషి?-

ఎవరా రసికశిఖామణి?-

ఎవరో కాదు. అర్జునుడు.

ఏడాదిపాటు అతినియమంగా తీర్థయాత్రలు చేసి తన ప్రతిజ్ఞ పూర్తిచేసుకురావాలని బయలుదేరిన అర్జునుడికి ఆదిలోనే 'హంసపా'దన్న సామెతని నిజంచేస్తూ, హంసపాదాల నడకల మత్స్యకన్య ఉలూచి ఎదురైంది.

ఎదురైవూరుకుందా? తన కళ్లమీదా, కస్తూరి నామంమీదా, ఒట్టుపెట్టి మరీ చెప్పిందే మని?-

ఒయ్యోయి! వలరాచవాడా! నా యౌవనం అంతా యీవేళదాకా నీకోసమే ముడుపుకట్టి వుంచానని యిప్పుడర్థమవుతోంది. ఈ చెప్పిన ఒట్టు పనికిరాదనీ, చాలదనీ, అన్నావనుకో, నీ పెదవుల తియ్యనివిషం తాగికూడా ఇదే మాట చెప్తానని-ఆ 'వృత్తస్తనద్విగుణభారమత్తకాశిని' అర్జునుణ్ని రేపెట్టింది..

ఇలాఅంది కదా అని, ఆ అమ్మాయి 'రతి పండితురాలు' కానేకాదు. అదికూడా చెప్పనే చెప్పింది. నేను కన్యనుతప్ప మరొకతెని కాను- అని.

పోనీ-యౌవనమదంతో మతితప్పి, ఎవరో ఒక మగవాడు దొరికాడు అనే 'ఆబ'తో మీద పడిందా ఉలూచీ.- అదీనిజం కాదు.

ఆ ఎదుటిమనిషి అర్జునుడని తెలుసు. సొంత యింట్లో, అన్నదమ్ములమధ్య యేర్పాటు చేసుకున్న 'సంసారసౌఖ్య'నియమంపట్ల, తెలియక, విధిలేక, పొరపాటుచేసి-వీధికెక్కవలసి వచ్చిందని తెలుసు. తీర్థయాత్రలకు బయలుదేరాడుగాని రతియాత్రకు కాదనికూడా తెలుసు.

తెలిసితెలిసీ ఒక అందమైన ఆడకూతురు అపరిచితుడైన మగమహారాజుని అంత ధైర్యంగా పడకటింటికి ఆహ్వానించవచ్చునా!

'వచ్చును' అని ఉలూచితీర్మానం. ఎలాగంటే : ఒకనాడు దారేబోతూ, అపరిచితపురుషుడుగా ద్రుపదసభలో ప్రవేశించి, మత్స్యయంత్రాన్ని కొట్టి, 'మన్మథమొలక'ని చేపట్టగాలేనిది, ఇప్పుడు ఈ మన్మథపతాకంమీది మత్స్యాన్నికొట్టి- ఈమత్స్యతంత్రాన్ని నడిపితే తప్పేమి? అని ఉలూచితర్కం.

ఈ తర్కాన్ని, ఆ నాగకన్య సిగ్గుతో మెలికలు తిరిగిపోకుండానే సూటిగా చెప్పింది.

ఎదుట తాంబూలం చేతబట్టుకుని-రొమ్ముల మీద చేయివేసుకుని,-కళ్లలో విరహబాధ తో ఆ ఆడకూతురలా దేవుల్లాడుతూంటే, ఈ ధర్మరాజు తమ్ముడికి ధర్మసందేహం వచ్చింది-"తీర్థ యాత్రావ్రతనియమం వుంది. ఎలాచచ్చేది?"- అని-

"చచ్చేవాళ్లకి ప్రాణదానం చెయ్యడంకంటే మించిన నియమం, ధర్మం వున్నాయా?" అని ఉలూచి మన్మథబాధని అడ్డుపెట్టి అర్జునుణ్ని మొగ మాటంలో పెట్టేసింది.


అర్జునుడింక తట్టుకోలేకపోయాడు. ఉలూచిని పెళ్లాడడానికి నిశ్చయించాడు. మన్మథుణ్ని మించిన 'ముహూర్తకా'డుండడు కద! గాంధర్వవిధి వుండనేవుందయ్యె!-

అర్జునుడు ఉలూచి పాణిగ్రహణం చేశాడు. ఆమె చేతిగాజులు, మువ్వలు, మోహనంగా మోగాయి,

అతని మనస్సు స్తిమితపడింది. ఆమెను కౌగిలించాడు.

కౌగిలన్న కౌగిలా అది?-

అది, రతినాటకానికి పూర్వరంగం. 'అలక' అనే చెట్టుని పడగొట్టే పెనుగాలి. శరీరాంగాలన్నింటికీ అద్భుతసుఖాన్నిచ్చే 'దాత'-.



కౌగిలిలో అతని భార్యగా ఒదిగింది ఉలూచి.

ఉలూచి పరవశించింది.

అర్జునుడూ అంతే-

'పరవశం' అనేమాటకి ఇతరులకి లొంగిపోవడం అని కూడా అర్థం. గొప్పయిష్టం కలిగినప్పుడే అది సాధ్యం-

గొప్పభక్తుడు తన దేవుడి దగ్గర పరవశిస్తే, గొప్పరసికురాలు తనకిష్టుడి దగ్గర పరవశిస్తుంది.

ఉలూచి పరవశంలోవుండగా, అర్జునుడామెను పక్కమీదకు జేర్చాడు. ఈ జేర్చడంలో ఆమె జుట్టు ముడి విడిపోయింది. ఆ ముడి సరిచెయ్యబోయాడు. పైట జారిపోయింది. పోనీ, ఆ పైట సర్దుదామనుకుంటూంటే చీర ముడి విడిపోయింది. ఇన్ని జారుపాట్లతో ఉలూచి సౌందర్యం చూసి అర్జునుడామెను గట్టిగా వాటేసుకున్నాడు.- నేర్పుగల స్త్రీలు ఏవిషయంలో అయినా తమకి లాభం చూసుకుంటారుగాని-(ముఖ్యంగా రతి విషయంలో) జారుపాట్లనీ, లోపాల్నీ పరిగణించరని-విజయవిలాసకావ్యం రాసిన వెంకటకవి తీర్మానం. ఈ తీర్మానం చెప్పే పద్యం ఇది :

శయ్యకు దార్పగాఁ దుఱుము జారె; నదం తటఁజక్కదిద్దబోఁ

బయ్యెద జాఱె; నయ్యదిరిపాటున గ్రక్కున నీవి జాఱె;రా

జయ్యెడ నవ్విలాసిని యొయారముఁజూచి కవుంగిలించె; నౌ!

నెయ్యెడ మేలె చూతురు; గణింపరు జాణలు జాఱుపాటులన్-

